


# ఆంజనేయ భాగోతం

భమిడి వెంకటేశ్వర్లు

**అంబికానగర్** కాలనిలో ఆంజనేయులు ఇల్లు.

తనకు అద్దెకిచ్చే అవకాశం లేదని ఇరవై నాలుగ్గంటలూ తపించిపోయేవాడు. అతనికో ఆలోచన అర్ధరాత్రి మెరిసింది —

తన వాటా కొచ్చిన రెండెకరాల పొలం బేరం పెట్టేసి, ఆ డబ్బుతో ప్రస్తుతం ఉన్న ఇంటికే మరో నాలుగు గదులు కట్టించాలన్నదే ఆ ఆలోచన.

రెండు నెల లయేసరికి పొలం అమ్ముడవటం ఇంటి ప్లాను మునిసిపాలిటీలో ఆమోద మవటం సిమెంటు, స్టీలు పర్మిట్ లేకుండానే కావలసినంత ఇంటికే చేరటం జరిగిపోయింది

అంబికానగర్ కాలనీలో మిగిలిన కాలనీలకంటే అద్దె లెక్కువని జగ మెరిగిన సత్యం. కాబట్టే వాళ్ళని చూసి మిగిలిన వాళ్ళు అద్దెలు పెంచుతూంటా రనేది కూడా కాదనలేని నిజం. అంతంత అద్దెలు చెవులు పిండి వసూలుచేసినా, అద్దెవాళ్ళని ప్రశాంతంగా ఉండనివ్వరనేది కూడా అందరికీ తెలిసిందే. పోతే ప్రభుత్వం ఉద్యోగులకు కరువుభత్యం పెంచినప్పుడల్లా అద్దె కూడా పెరుగుతుంది. లేకపోతే ఏడాది తిరిగే సరికి తప్పనిసరిగా పెంచవలసిందే. అది కాలనీ ఇళ్ళ యజమానులు తీసుకున్న నిర్ణయం. అది తు. చ. తప్పకుండా అంతా పాటిస్తారు.

కాని ఇంటి యజమానులు అద్దెకుండే వాళ్ళని తప్పనిసరిగా బాధిస్తుండాలని, ఇబ్బంది పెట్టాలని, తమ- ఇష్టం వచ్చినప్పుడు ఖాళీ చేయించాలని — వారంతా ఏ గ్రంథాల్లో చదివారో కాని ఆచరణలో మాత్రం అవలీలగా జరిగిపోతుంది.

కాబట్టే ఆ కాలనీలో ఎవరైనా ఏ ఇంట్లో ఆరు నెలలు పైనే ఉన్నా రంటే, వారిని 'పద్మభూషన్' లాంటి బిరుదుతో సత్కరించవలసిందే!

కాని కొన్ని మొండి ఘటాలు ఇంటి యజమానులని అద్దె ఇవ్వటంలో గాని, మిగతా విషయాల్లోగాని ఇరకాటంలో పెట్టేవి కూడా లేకపోలేదు.

ఆంజనేయులుకు ఏదో ప్రజా సేవా కార్యక్రమంలో ఉండాలని పాలిసీ ఉంది. కాబట్టే ఆఫీసులో తరుచు జరిగే సాహితీ సమితి, నాటక సమితి క్యాంటీను, రిక్రియేషను క్లబ్బు, కోఆపరేటివ్ బ్యాంకు, యూనియన్, గృహ నిర్మాణ సంఘం లాంటి వాటిలో ఏదో ఒక పదవి ఇస్తుంటారు నిర్వాహకులు.

లేకపోతే వాటి కార్యకలాపాల్లో అనవసర జోక్యం కలిగించుకొం టుంటాడనేది చాలామందికి తెలిసిన విషయమే.

అయితే ఇటీవలి కాలంలో, అందరిలో 'ప్రజాసేవ' చేయాలన్న ధ్యాస కోరిక ఎక్కువయి పోవటంతో. ఆ సంస్థలకు ఎన్నికలు నిర్వహించటంతో ఆంజనేయులు ఓడిపోయాడు, అన్నింటిలోనూ!

''ఇన్నాళ్ళు నా చేత సేవ చేయించుకొన్న వీళ్ళం దరూ నన్ను కావాలని పదవీభ్రష్టుడిని చేశారు? కలికాలం ... ఏం చేస్తాం?'' అనుకొంటూ అతను అంబికా నగర్ హౌసింగ్ సొసైటీ, వెల్ఫేర్ అసోసియేషన్ లకు సెక్రటరీగా ఏక గ్రీవంగా ఎన్నికయ్యాడు.

ఏ మాట కా మాటే చెప్పాలి. పదవి, హోదా ఉండాలే కాని, ఆంజనేయులు అహర్నిశలు శ్రమి

స్తాడు. స్వంతలాభం, స్వార్థం లేకుండా ఈ రోజుల్లో ఎవరు ప్రజాసేవ చేస్తున్నారు?

వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రెటరీగా ఆంజనేయులు తన కాలనీలో తారు రోడ్లు వేయించాడు తన ఇంటి కెదురుగా వీధి దీపం వచ్చేట్లుగా ట్యూబ్ లైట్లు వేయించాడు. పోస్టుబాక్సు, చెత్త కుండీలు ఏర్పాటు చేయించాడు.

తన చుట్టూ జనం తిరగాలి, అన్ని విషయాలు తన దృష్టికి రావాలి, తనకు పేరు, పలుకుబడి పెరగాలి. ఇంతచేసిన దానికి కొంతయినా మిగలాలి—అనుకొంటాడు ఆంజనేయులు.

• • •

ఆ కాలనీకి పాలబూత్ సౌకర్యం లేదు. ప్రక్క కాలనీలో ఉన్న బూత్ ద్వారానే పాలు తెచ్చుకోవలసి రావడం వల్ల చాలా మందికి అసౌకర్యంగా ఉందన్న విషయం ఆంజనేయులు గుర్తించాడు.

ఆ నెల కాలనీ మీటింగులో ఆ విషయంపై అతను ఒక ప్రతిపాదన లేవదీయించి 'ఓ.కే.' అనిపించాడు.

వెల్ఫేర్ అసోసియేషను ఇంటి యజమానుల నుంచి మూడు రూపాయలు, అద్దెకున్నవాళ్ళ నుంచి రెండు రూపాయలు నెల చందా వసూలు చేస్తారు. ఆ డబ్బు కాలనీ అభివృద్ధికి, సాంస్కృతిక కార్యకలాపాలకు వినియోగిస్తారు.

ఇంటి యజమానుల నుంచి అదనంగా పది రూపాయలు వసూలుచేసి, కాలనీ నిధులు చేర్చి డైరీ కార్పొరేషనులో డిపాజిట్ కట్టి, పాలబూత్ ఏర్పాటుకు ఆంజనేయులు ప్రయత్నించాడు.

నాలుగు నెలల తరవాత అంబికా నగర్ కాలనీకి బూత్ మంజూరు చేసినట్లు డైరీ అధికారులు తెలిపారు.

తనవల్లే కాలనీకి 'బూత్' వచ్చిందని ఆంజనేయులు చెప్పుకున్నాడు. కాని ఆ కాలనీలో 'డైరీ'లో పనిచేసే అధికారి అద్దె కుంటున్న విషయం, ఆయన వల్లే బూత్ కాగితాలు త్వరత్వరగా కదిలినట్లు చాలామందికి తెలియదు.

ఎలాగైతేనేం కాలనీ వాళ్ళకి బూత్ వచ్చింది.

ప్రక్క కాలనీ పాలబూత్ నిర్వహణలో లోపాలుండటంతో, ఆ వ్యవహారాన్ని కూడా అంజనేయులకే వదిలిపెట్టారు. ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు.

అతి కొద్ది కాలంలోనే అంబికా నగర్ పాలబూత్ ద్వారా రోజువారీ అమ్మకాలు ఎక్కువ కావటంతో కమీషను బాగా లభించేది.

అంజనేయులు దృష్టి ప్రజాసేవ నుంచి 'కమీషను' వైపుకు మళ్ళింది. కొంత అయినా ఖర్చు పెట్టి కాలనీ వాళ్ళకు మరింత సేవ చేయాలన్న ఆలోచన విస్తృతమయింది అతనిలో!

రోజులు మారుతున్నాయి. ప్రజల ఆలోచనలు చెదిరిపోతున్నాయి. రాష్ట్ర రాజకీయాలు ఢిల్లీ రాజకీయాలతో ముడిపడటంతో నాయకులు మారుతున్నారు. ఏమిటో— ఈ అస్థిర రాజకీయాలు!

సరిగ్గా అటువంటి రాజకీయాలే ఆ కాలనీ ప్రజల్లో చోటు చేసుకోటంతో, ఆంజనేయులు భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ పదవి నుంచి తప్పుకొన్నాడు. అలా చేసేందుకు కాలనీవాసులకు తెలియని వ్యవహారం వేరే ఉంది. దాని గురించే బాహాటంగా విమర్శ చేయసాగారు, తెలిసిన వాళ్ళు.

• • •

అంజనేయులు తన హయాములో రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవాలని ఉత్సాహంగా జరిపించేవాడు. షామియానాలు, కుర్చీలు, మైకులు, లైటింగు, బహుమతులు ... ఎన్నో హంగులు సమకూర్చేవాడు.

అయితే ఆ వ్యవహారం తనపై వేసుకోవటంలో స్వార్థం లేకపోలేదు.

అతనికి సంగీతం, నృత్యం అంటే అభిలాష ఎక్కువ. పైగా తన కూతుళ్ళకి, భార్యకి ఆ రంగంలో ప్రవేశం, శ్రద్ధ ఉండటంతో మరింత ఆసక్తిగా పని చేయసాగాడు. అతని బంధువుల్లో ఒకావిడకు సంగీతం, నృత్యాలలో విశేష అనుభవం ఉండటం వల్ల, ఆవిడను తన కాలనీ వేడుకల్లో పరిచయం చేస్తే ఆవిడకు ఆర్థిక సహాయం, తన వాళ్ళకు మరింత ప్రవేశం ... ఆలోచన బాగానే ఉందనిపించింది.

కాలనీ స్టేజిమీద సంగీతం, నృత్యం జరుగుతుంటే తన పిల్లలు ఫోటోల్లో బాగా కనబడేలా ఫోటోగ్రాఫరుకు సూచనలు ఆంజనేయులు ఇవ్వటం చూసిన వాళ్ళకి, విన్నవాళ్ళకి అసలు విషయం బోధపడింది.

'తనకంటూ లాభం, ప్రయోజనం ఉంటేనే అతను ఏదైనా చేస్తాడు' అన్నది చాలా మందికి తెలిసిపోయింది.

విమర్శలు, అభియోగాలు చాలా దూరం పోయాయి. ఈ విధంగా కాలనీ నిధులు దుర్వినియోగం జరిగాయి. సభ్యులు లెక్కలు కోరారు. ఫలితంగా ఆంజనేయులు తన పదవికి రాజీనామా సమర్పించాడు. కాని సభ్యులు అంతటతో వూరుకోలేదు.

అది వేరే విషయం—ఈ కథకు ఆ వ్యవహారం అనవసరం కాబట్టి అసలు కథకు వచ్చేద్దాం!

ఆంజనేయులు రాజకీయం, అధికారం, తన పలుకుబడి ఉపయోగించి తను కట్టబోయే ఇంటికి సిమెంటు, స్టీలు సంపాదించుకో గలిగాడు.

రెండు నెలల్లో అనుకొన్న విధంగా అతని కోరిక నెరవేరింది. అతని ఇల్లు అద్దెకు సిద్ధమైంది.

అందుకు 'టు లెట్' బోర్డు ద్వారా ప్రచారం చేయనవసరం లేదు అతను.

అతను పక్కా శాకాహారి. కాబట్టి శాకాహారులకే ఇల్లు ఇస్తాను అన్నాడు. పైగా అనుకున్న దానికంటే మరో గది అదనంగా కట్టగలిగానన్న అహం అతనిలో నాటుకు పోవటంతో తన నాలుగు గదుల ఇంటికి అయిదు వందలు అద్దె అన్నాడు.

అంత అద్దె భరించటం ఈ రోజుల్లో మాటలా!

అయితే చాలా మంది ముందుకు వచ్చారు. కాని వారందరికీ అతను విధించే షరతులు కష్టం కలిగించేవి.

రెండు నెలల అద్దె అతను నష్టపోయాడు, ఆ విధంగా!

ఆంజనేయులు వెంటనే కొన్ని షరతులు సడలించాడు.

• • •


ఫుడ్ కార్పొరేషను అధికారి మూర్తిరాజు. ఆయన మద్రాసునుంచి హైదరాబాద్ బదిలీ అయి వచ్చాడు. ఆయనకో ఇల్లు కావాలి. ఆ విషయమే తన కొలీగ్ కృష్ణమూర్తికి తెలిపాడు ఆయన.

కృష్ణమూర్తి అంబికా నగర్ కాలనీలోనే ఉంటాడు. అతను మూర్తి రాజుని ఆంజనేయులుకి పరిచయం చేసి ఆ ఇల్లు చూపించాడు.

మూర్తిరాజు పేరుని బట్టి 'మాంసాహారి'గా భావించాలి కాని సిసలైన శాకాహారి.

ఆంజనేయులు తన ఇంటిని ఆయనకు ఇచ్చేందుకు అంగీకరించాడు, స్వల్ప షరతులపై!

నెలకు అయిదు వందలు అద్దె. మూడేళ్ళ లోపుగా ఇల్లు ఖాళీ చేయకూడదు. ఇల్లు ఖాళీచేసే



వరకు అద్దె తను పెంచడు. అయిదువేలు అడ్వాన్సుగా ఇవ్వాలి. అది వెళ్ళే ముందర తిరిగి ఇవ్వబడుతుంది. కాని ఆ సొమ్ముకు ఎటువంటి వడ్డీ ఉండదు. కాంపౌండులోని చెట్ల బాధ్యత వారిదే. నీరు, కరెంటు బిల్లులు వారే ఆయా ఆఫీసుల్లో కట్టాలి. అని కొన్ని స్వల్పమైన షరతులు మాత్రమే.

వాటన్నింటికీ చిరునవ్వుతోటే ఆయన అంగీకరించాడు. వెంటనే అయిదు వేలకి చెక్ రాసిచ్చాడాయన.

"మరో ముఖ్యమైన విషయం..." ఆగాడు ఆంజనేయులు.

"ఏమిటో అది?" రాజుగారు అనుకొన్నారు.

"ఏం లేదు. అందరికీ తెలిసిందే! మునిసిపాలిటీ వాళ్ళు కాని, మరెవరయినా కానీ అద్దె ఎంత అని అడిగితే రెండు వందలు అని చెప్పాలి. దయచేసి అద్దె ఇచ్చినట్లు రశీదులు కోరవద్దు." చెప్పాడు ఆంజనేయులు.

"ఇంత సిల్లీగా ప్రవర్తిస్తాడనుకోలేదు." రాజుగారు మనసులోనే ఆంజనేయులుని అంచనా వేసుకొన్నారు.

మరో రెండు రోజుల తరవాత రాజుగారు ఫామిలీతో ఆ వాటాలోకి దిగిపోయారు.

ఆంజనేయులు ఇంటికి ఒకవైపు రామారావు, మరోవైపు కృష్ణారావుల ఇళ్ళు ఉన్నాయి.

రామారావు తనవైపు ప్రహరీగోడ కట్టించినా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కృష్ణారావు కట్టించలేదు. అతనితో ఆంజనేయులు చాలాసార్లు చెప్పాడు.

మరోనెల తరవాత —

"మిస్టర్ కృష్ణారావ్! ప్రహరీగోడ ఎప్పుడు కట్టిస్తున్నారు? నా దగ్గర డబ్బు లేకపోయినా, అప్పుచేసి కట్టించాను. మీరు కూడా ఎలాగో కట్టిస్తేనే బాగుంటుంది. తరవాత మరింత ఖర్చు!" అన్నాడు.

ఆ మాటల్లో అభ్యర్థన కన్నా దబాయింపు, హెచ్చరిక, అహం ధ్వనించాయి. ఎదుటి వారు తన కన్న తక్కువ అన్న తీరులో అతను వ్యవహరిస్తాడు.

"సారీ! మరో ఏడాది దాకా నేనేమీ తలపెట్ట దలుచుకోలేదు!" తన అశక్తతను తెలియజేశాడు కృష్ణారావు.


"అలా అంటే ఎలా? వెంటనే ఏదో చేయాలి!" మరింత గట్టిగా చెప్పాడు ఈ సారి.

"క్షమించండి! అది నా వల్ల కాదు" "అనేసి కృష్ణారావు లోపలికి వెళ్ళిపోయాడు. తనపట్ల కనబరిచే ముభావమే అతన్ని ఆ విధంగా మాట్లాడించింది.

భర్త తీరుతెన్నులు కొంతవరకైనా భార్య, సంతానం మీద ప్రభావితమవుతాయి.

రామారావు భార్య విశాలాక్షికి ఒక కాన్వెంట్ స్కూల్లో టీచరు ఉద్యోగం వచ్చింది. ఆ విషయం తెలిసి ఆంజనేయులు భార్య శాంతాదేవి మాటల సందర్భంలో—

"ఆడవాళ్ళకు ఎందుకు చెప్పండి ఈ ఉద్యోగాలు? అనలే మగవాళ్ళకి ఉద్యోగాలు లేవని అందరికి తెలి




సిందే! భర్తతో పాటు భార్య కూడా ఉద్యోగం చేయటం, పిల్లల్ని వేరే వారిపై వదలిపెట్టటం... ఏం బాగుంటుంది?" అన్నది.

ఆ మాటల్లో సలహా కంటే అసూయ, ద్వేషం ఎక్కువ కనిపించింది విశాలాక్షికి.

దాని పర్యవసానం— వారిద్దరూ విరోధులయ్యారు.

మరో రెండు నెలల తరవాత, శాంతాదేవికి కూడా టీచరు ఉద్యోగం రావటంతో విశాలాక్షి పరోక్షంగా విమర్శించిన తీరు ఆమెకు చేరేసరికి వారిద్దరూ మళ్ళీ దగ్గరయేందుకు అవకాశం ఏర్పడింది.

అధికారం, పదవి పోతే వాటిని తిరిగి సంపాదించే వరకు ఆ రంగంలో ఉన్నవారికి ఏదో పోగొట్టుకొన్నట్లుగానో పిచ్చి పట్టినట్లుగానో ఉండటంతో ఆశ్చర్యం ఉండదేమో? ఎలాగైనా తిరిగి పొందేందుకు అహర్నిశలు ఆలోచన చేస్తారు.

ఆంజనేయులు కూడా అంతే!

ఒక అర్ధరాత్రి కలిగిన ఆలోచన —

తన భార్య, పిల్లలకు సంగీత నృత్యం అంటే అభిలాష. పైగా తెలిసిన బంధువుల్లో ఒకావిడ తన అభీష్టాన్ని తెలిపింది. పుణ్యం, పురుషార్థం, ప్రజాసేవ స్వార్థం... అన్నీ నెరవేరుతాయి.

మరో నెల తరవాత ఆ ఆలోచన కార్యరూపం దాల్చింది. పర్యవసానంగా "అంబికా సంగీత నృత్య సభ" ఏర్పాటయింది. ప్రారంభోత్సవానికి ఒక మంత్రిగారు రావడం, ఆ విషయం అన్ని పత్రికలు బాగా ప్రచారం చేయడంతో, ఆ సభకు బాగా గుర్తింపు, ఆదరణ లభించాయి.

నెల నెలా కార్యక్రమాలతో ఆంజనేయులు చాలా బిజీగా ఉన్నాడు. అతని కోరిక నెరవేరింది.

అతని చుట్టూ కార్యక్రమాల కోసం జనం ఎగబడసాగారు. పత్రికా విలేఖరులు, సభ్యులు, నిర్వాహకులు... జోరు ఎక్కువయింది.

● ● ● ●

ఒక్క ఏడాది కాలంలోనే మూర్తిరాజు గారితో కృష్ణారావుకు స్నేహం బాగా పెరిగింది. రెండు కుటుంబాలు బాగా దగ్గరయాయి. తరుచు షికార్లు, సినిమాలు వారి మధ్య చోటు చేసుకున్నాయి.

వారా విధంగా స్నేహంగా ఉండటం శాంతాదేవితో పాటు ఆంజనేయులుకు కూడా అసూయగా ఉండేది.

వారు ఒంటరి తనాన్ని కొలుస్తారు. కాబట్టి మూర్తిరాజు గారు కాని, ఆయన భార్య గాని ఇంటి యజమానితో ఎక్కువ 'కలివిడి'గా ఉండేందుకు దోహదపడలేదు.

"ఒక ఇంటి యజమాని అయిన కృష్ణారావు తన ఇంట్లో అద్దెకుండే వారితో అలా కలిసి ఉండటం అభిమానంగా ఉండటం ఆంజనేయులు శాంతాదేవి సహించలేక పోయేవారు.

● ● ● ●

కాలం ఎవరి ప్రమేయం లేకుండా పరుగెత్తుకు పోతూంది. ఆ విధంగా రెండు సంవత్సరాలు గడిచింది.

"దేశంలో అన్ని వస్తువుల ధరలు అంతరిక్షంలోకి పరుగు పెడుతున్నాయి. అద్దెలు పెంచుతున్నారు. ఇంటి పన్నులు పెరిగాయి. ఇల్లు ఖాళీ చేసేవరకు అద్దె పెంచనని ఆంజనేయులుగారు మొదట్లో అని ఉండవచ్చు. మనమే మరో పాతిక ఎక్కువ ఇద్దాం" అనుకొన్నారు రాజుగారు.

ఆయన భార్య సరే నంది.

"మనమే అలా చేస్తే బాగుంటుందా?" మరో ఆలోచన కలిగింది ఆయనకు.

"అందరూ ఇంటి అద్దెలు పెంచారండీ! మన ఇంటి కన్నా చిన్న వాటా . . . సుబ్బారావు ఆరు వందలు చలపతిరావు మరోపాతిక పుచ్చుకొంటున్నారు... రేపు పిల్లల్ని మరో స్కూల్లో వేస్తే రెండువేలయినా డొనేషన్లు ఇవ్వాలి... రాజు గారిని మరో ఏభై ఎక్కువ అడుగుదాం... లేదా ఖాళీ చేయమందాం... ఎటూ ఆయనకి నోరు పారేసుకొనే అలవాటు లేదు కదా, ఖాళీ చేస్తారు..."

ఒక రోజు రాత్రి భర్త పక్కన చేరి, శాంతాదేవి తన ఉద్దేశాన్ని తెలిపింది.

ఆంజనేయులుకు వెంటనే 'ఈమే ఈ దేశానికి ప్రధాని అయితే ఎంత బాగుంటుంది?' అనిపించింది.

● ● ● ●

రెండు నెలల తరవాత —

రాజుగారి భార్య ఇంటి అద్దె ఇచ్చి తిరిగి వచ్చింది.

మరో అరగంట తరవాత ఆంజనేయులువచ్చాడు.

పది నిమిషాలు లోకాభిరామాయణం చర్చించాడు. అయితే వచ్చిన విషయం చెప్పేందుకు తటపటాయిస్తున్నట్లు రాజుగారు గ్రహించక పోలేదు.

రాష్ట్ర రాజకీయాలు ... ఇళ్ళు కట్టడంలో సాధక బాధకాలు... సిమెంట్ బ్లాక్ మార్కెట్... ఇంటి పన్నులు... ఆఫీసు వ్యవహారాలు మొదలైనవి సునాయాసంగా దొర్లిపోయాయి.

"ఏమిటో నండి, ఈ సభా బాధ్యత తీసుకొన్నప్పట్నుంచీ వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు! పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు... పైగా మా అమ్మగారు, నాన్నగారు నా దగ్గర ఉండేందుకు వస్తున్నట్లు ఉత్తరం రాసేరు. నాకేమో మూడు గదులే! ఇవన్నీ ఎలా సర్దుబాటు చేసుకోవాలో అర్థం కావటం లేదు.. అందుకని " ఆంజనేయులు ఒక్కక్షణం

చెప్పటం ఆపి రాజుగారి వైపు చూశాడు.

అంతవరకు అతను ఆయనపై చూపులు నిలప లేకపోయాడు.

ఆయన ఏవి గా మాట్లాడలేదు.

ఆంజనేయులు చెప్పక తప్పలేదు. "మరో మూడు నెలల్లో ఇల్లు ఖాళీ చేయుమని!"

"నేనెందుకు ఖాళీ చేయాలి? ఇల్లు దొరికితేనే ఖాళీ చేస్తాను. ఏం చేస్తావో చేసుకో..." లాంటి మాటలు రాజుగారు అనలేక కాదు.

"సరే చూద్దాం లేండి!" అన్నారు ఆయన.

ఆంజనేయులు తృప్తిగా గాలి పీల్చుకుని వెళ్ళిపోయాడు.

ఈ విషయం రాజు గారి భార్య కృష్ణారావు భార్య దగ్గర ప్రస్తావించింది.

• • • •

రాజుగారు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకొన్నారు. బేరసారాలు, పొడిగింపులు ఆయనకు నచ్చవు. మరో రెండు నెలలు గడిచాయి.

ఇంటి కోసం సిన్సియర్‌గా ప్రయత్నం చేయసాగారు.

స్టేట్ బ్యాంక్ కాలనీలో ఒక ఫ్లాట్ దొరికింది. అయితే ఫస్ట్ తేదీన చేరేందుకు ఆ ఇంటి యజమాని అడ్వాన్సు అడిగాడు.

ఇక్కడ ఈ ఇంటి అద్దె పూర్తిగా ఇచ్చేశాడు. ఇంకా ఒకటో తారీఖు పదిహేను రోజులుంది. తను పదిహేను రోజుల అద్దె నష్టపోతున్నాడు. ఏం చేయాలి?

"ఇల్లు ఖాళీ చేయుమని అనిపించుకొన్నాక ఇంకా ఆ ఇంట్లో ఉండేందుకు ఆయన మనసంగీకరించలేదు.

కొత్త ఇంటికి అడ్వాన్సు ఇచ్చేరు ఆయన.

నాలుగు రోజుల తరవాత అంజనేయులు ఇల్లు ఖాళీ చేసేసి రాజుగారు ఇంటికి తాళం వేసుకొని వెళ్ళిపోయారు.


ఆయనకు ఆ ఇంటిలో ఇంకా నెలాఖరు వరకు 'లీజ్' ఉందన్నమాట. కొన్ని చిన్న చిన్న సామానుల ఆ ఇంట్లో ఉంచారు

• • • •

నెలాఖరున రాజుగారు ఆంజనేయులును కలిశారు

"ఏం రాజుగారూ! ఇలా చేశారేమిటి? సామానులు తీసుకెళ్ళాక తాళం ఎందుకు వేశారు? ఇలా అర్ధాంతరంగా ఖాళీ చేయుమని నేను చెప్పలేదు కదా! కనీసం ఇల్లు దొరికినట్లు, ఫలానా రోజున ఖాళీ చేస్తున్నట్లు మాటవరసకైనా చెప్పకపోవడం బాగుందా మీకు? . . ." ఇంకా ఏదో అనబోతుండగానే అతని మాటలకు ఆయన అడ్డుపడి అన్నారు.

"ఇవన్నీ ఎందుకొచ్చిన మాటలు? మీ కిచ్చిన అయిదువేలు అడ్వాన్సు ఇప్పుడే ఇవ్వమని నేను అడగటం లేదు కదా! కనీసం నేను ఈ ఇంట్లో ఉండని పదిహేనురోజుల అద్దె వాపసు ఇమ్మని కోరను... పోతే, మంచి ఇల్లు దొరికింది, ఖాళీ చేయుమని ఇదివరకే చెప్పారు. కాబట్టి నే నిచ్చిన అడ్వాన్సు మీకు వీలు న్నప్పుడు ఇవ్వండి... అందుకు నే నేమీ షరతులు




పెట్టను. ప్రామిసరీ నోటు కూడా అవసరం లేదు. మీరూ నేనూ ఎక్కడకీ పోయేది లేదు." రాజుగారు చాలా సౌమ్యంగా చెప్పారు.

ఒక ప్రభుత్వ అధికారి, మరో ఎగువ తరగతి గృహస్థు మధ్య సాగిన సంభాషణ అది.

ఇంటి యజమానిగా ఆంజనేయులు తన ఆధిక్యం కోసం మాట్లాడటం రాజుగారికి కొంచెం బాధ కలిగించి ఉండవచ్చు.

ఈ రోజున ఒక ఇంటి యజమాని. నిన్నటి వరకు మరో ఇంట్లోనే అద్దెకున్నట్లు మరిచిపోయి అహం గర్వం, ప్రదర్శించడం బాగుండదు. అయినా ఆయన తన హద్దులు దాటి మాట్లాడ లేదు.

రాజుగారున్న రెండున్నరేళ్ళ కాలంలోను ఆంజనేయులుకి ఎటువంటి ఇబ్బంది, అసౌకర్యం ఏ విషయంలోను కలగలేదు. తను అధికారి, ధనవంతుడన్న దర్పం, గర్వం, ఎక్కడా ప్రదర్శించ లేదు.

వారా ఇంట్లో ఉన్నట్లు ఎవరూ అనుకోలేదు.

కాని శాంతాదేవి మాత్రం రాజుగారి భార్యతో వారున్న కాలంలో ఏ నాలుగయిదుసార్లో మాట్లాడింది. అదైనా గేటు ఎవరో తీసి, వేయనప్పుడు —మేకలు లోపలికి చొరబడి చెట్లు, మొక్కలు తినేసినప్పుడు హెచ్చరిక రూపంలో!

లేని అభిమానం తెచ్చుకొని, ముఖమంతా నవ్వు తెచ్చుకోడం ఆమె ప్రత్యేకతగా అందరికీ తెలుసు.

ఇంటి యజమానికి సరియైన మంచి అద్దెవాళ్ళు దొరకడం అదృష్టం, వరంగానే భావించాలి.

కేవలం అద్దె కోసం కాదు, ఒకరి కొకరు సహాయకారిగా ఉండేందుకే అని ఎంతమందికి తెలుసు?

మరో అయిదు నిమిషాలు మాట్లాడేక రాజుగారు వెళ్ళిపోయారు.

• • • •

రెండు రోజుల తరవాత ఆంజనేయులు కృష్ణమూర్తిని కలిసి "మీరు చేర్పించిన మూర్తిరాజు హఠాత్తుగా ఇల్లు ఖాళీ చేసేశారు..."అని చెప్పాడు.

అయితే జరిగిన భాగోతం మూర్తికి తెలియదా?

"ఆయన నీటి బిల్లులు, కరెంటు బిల్లులు మాత్రం ఇవ్వాలి" అన్నాడు. ఆ మాటల్లో అవి మీరు తీసుకొని ఇవ్వాలసిందిగా కోరుతున్న అర్థం స్ఫురించింది కృష్ణమూర్తికి. ఆంజనేయులి రాజకీయం అందరికీ తెలిసిందే!

• • •

ఆంజనేయులు ఇంటిని పదిహేనురోజులుఖాళీగా ఉంచి, రంగులు వేయించాడు... కొన్ని కొత్త సదుపాయాలు కలిగించాడు.

ఒక శుభోదయాన్న వీధి కిటికీకి "టులెట్" బోర్డు తగిలించబడి ఉంది... చూపరులను ఆహ్వానిస్తోంది.

మూర్తిరాజు గారిని ఖాళీ చేసేందుకు చెప్పిన కారణాలేవీ ఆచరణలోకి రాలేదు... చూసిన వారికి, తెలిసిన వారికి అనుమానం కలిగినా, ఆశ్చర్యం మాత్రం కలుగలేదు.

ఇప్పుడా వాటాకి అద్దె ఏడువందలు మాత్రమే!

• • • •

ఒక ఆదివారం రోజున సూర్యోదయం కాకుండానే ఆ ఇంటికి చక్రవర్తి అనే ఆయన అద్దెకోసం వచ్చాడు. ఆంజనేయులు ఇల్లు చూపించి తన షరతులు, అద్దె వినిపించాడు.

పావు గంట సేపు అద్దె విషయంలో ఇద్దరి మధ్య తర్జన భర్జనలు జరిగాయి. చివరికి అద్దెలో పాతిక రూపాయలు తగ్గించాడు.

చక్రవర్తి ఆంజనేయుల్ని రోజూ ఉదయం, సాయంత్రం పలకరిస్తూ, ఇంట్లో చేసుకొన్న టిఫిన్లు పంపిస్తుండటం, కొన్ని కొన్ని పనులు చేస్తుండటం వల్ల, ఆంజనేయులికి అతనంటే మంచి అభిప్రాయం ఏర్పడిపోయింది.

అయితే ఆ అభిప్రాయం మూడు నెలలకంటే ఎక్కువ నిలబడలేదు... ఆ తరవాత నుంచే అసలు కథ మరో పద్ధతిలో నడిచింది.

అద్దె నాలుగయిదుసార్లు అడిగాక పదిహేనవ తేదీ తరవాత ఇవ్వటం, గేటు వేయక పోవటం, మరి కొన్ని ఇతర చిల్లర వ్యవహారాల్లో, సహాయ నిరాకరణతో చక్రవర్తి మీదున్న సదభిప్రాయం తొలగిపోయింది.

చివరికి 'అతనిని ఏ విధంగా తొలగించుకోవాలి ?' అన్న ఆలోచన మీద ఆంజనేయులు ఎక్కువకాలం వినియోగించేవాడు.

"మూర్తిరాజు లాంటి మంచి మనిషిని అద్దె కోసం, కృష్ణారావు ఫామిలీ నుంచి దూరం చేయాలన్న తలంపుతో వదులుకోవటంతో శాస్తి ఇలా జరిగిందేమో?" అనుకొన్నాడు ఆంజనేయులు.

కాని చక్రవర్తి చేత ఇల్లు ఖాళీ చేయించటం అంత తేలిక అయిన పని కాదని తన రాజకీయం ద్వారా తెలుసుకొన్నాడు ఆంజనేయులు.

బెదరించినా, కోర్టు కెక్కినా కాలయాపనే కాని, ఫలితం ఉండక పోవచ్చును... ఎలాగైనా 'రివర్సుగేరు'లో చక్రవర్తిని వదులుకొనేందుకు నిశ్చయించుకొని, అది ఎంతవరకు క్రియారూపం దాలుస్తుందో మరి? అన్న ఆలోచన కలిగింది.

అయితే ఈ భాగోతం ఎలా నడిపించాలన్నదే **ఆంజనేయులుకు పట్టుకున్న విచారం, బాధ!** ★